సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 23 । మే । 2025



జాడ లేని సంక్షేమం..!

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికుల పొట్టకొట్టింది. కార్మికుల సంక్షేమ బోర్డులోని నిధులను దారి మళ్లించింది. - 10లో



వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లపై.. టీడీపీ వర్గీయుల దాడి - 10లో

బాడంగి మండలం పినపెంకి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుపై టీడీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారు. గాయపరిచారు.



ఎండీయూ ఆపరేటర్ల ఆందోళన

ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. - 10లో

న్యూస్‌రీల్

24న గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

పార్వతీపురం: ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఈ నెల 24న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పీఓ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ, ఏఈక్యూలకు చెందిన విద్యార్థులు పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఉదయం 10గంటల నుంచి జరగనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. విద్యార్థులు పదోతరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు.

సీతంపేటలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

పార్వతీపురం టౌన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికను సోమవారం 10 గంటల నుంచి సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సీతంపేట వచ్చి అందజేయాలని కోరారు. జిల్లా అధికారులందరూ సీతంపేటలో జరిగే పీజీఆర్ఎస్‌కు హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

ఆధునిక సాగుకు మార్గనిర్దేశం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఆధునిక విజ్ఞానం, సంప్రదాయ పద్ధతులు కలగలిపిన వ్యవసాయం అందరి లక్ష్యం కావాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దేశవ్యాప్తంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఐసీఏఆర్ డైరెక్టర్లకు సూచించారని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ధ్రువ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సదస్సును ప్రారంభించారని గురువారం విలేకరులకు తెలిపారు. రైతుల జీవన ప్రమాణాలు మెరుగవ్వాలంటే ఆధునిక విజ్ఞానం, సంప్రదాయ పద్ధతులు కలగలిపిన వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని, 'వికసిత భారత్' లక్ష్యంగా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారని, ఉత్పత్తి పెంపు, ఖర్చుల తగ్గింపు, సరైన ధర, సహజ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి విషయాలపై కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని వివరించారన్నారు. రైతుల సమస్యలపై నేరుగా చర్చించేందుకు ఆయన పాదయాత్ర చేపడతారని తెలిపారన్నారు. వ్యవసాయ విద్యను ప్రాయోజితంగా మార్చాలని, పరిశోధనలు రైతుల వరకూ చేరాలని సూచించినట్లు పేర్కొన్నారన్నారు.

వ్యాసరచన పోటీల్లో బొబ్బిలి విద్యార్థినికి ఫస్ట్



జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో యశస్విని

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన తమ్మిరెడ్డి యశస్విని జీవవైవిధ్యంపై జోనల్ విభాగంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంలో భాగంగా యశస్వినికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేసినట్టు పాఠశాల హెచ్‌ఎం చింతా రమణ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అంతన్నారు.. ఇంతన్నారు.. మంత్రిగారు!

- శ్యామలాంబ పండగ ఏర్పాట్లలో ఘోర వైఫల్యం
- 15 ఏళ్ల తర్వాత నిర్వహించిన పండగకు భారీగా తరలివచ్చిన భక్తులు
- ఏర్పాట్లన్నీ స్వయంగా పర్యవేక్షించిన మంత్రి సంధ్యారాణి
- కనీసం నీరు, విద్యుత్ కూడా అందించలేకపోయిన వైనం
- పండగ వేళ సాలూరులో చీకట్లు
- వచ్చిన బంధువులకు మర్యాదలు చేయలేకపోయామని ఆవేదనతో రోడ్డెక్కిన ప్రజలు



సాలూరు మెయిన్ రోడ్డుపై ఆందోళన చేస్తున్న భోను, మజ్జిల, తోటవీధి ప్రజలు

సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు: సాలూరు ప్రజల ఆరాధ్య దైవం శ్యామలాంబ ఉత్సవం 15 ఏళ్ల తర్వాత జరగడంతో ఆ ప్రాంత వాసులంతా ఎంతగానో సంతోషించారు. ఎక్కడెక్కడో ఉంటున్న తమ ఇంటి పిల్లలను, బంధువులను, స్నేహితులను పిలిచారు. రెండు లక్షల మందికిపైగా పండగకు వస్తారని ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం ఊహించారు. ఉత్సవం ఎటువంటి లోటుపాట్లూ లేకుండా నిర్వహిస్తామని ఊదరగొట్టారు. స్వయంగా స్థానిక శాసనసభ్యురాలు, రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఏర్పాట్లన్నీ దగ్గరుండి పర్యవేక్షించారు. సంధ్యమ్మ వచ్చింది.. పండగ తెచ్చిందంటూ వీధివీధినా ఫ్లెక్సీలు వేయించారు. సోమవారం నుంచి బుధవారం జరిగిన పండగలో అడుగడుగునా అవరోధాలే. మంచినీటి సరఫరా మొదలు విద్యుత్ అంతరాయం వరకూ.. అస్తవ్యస్త ట్రాఫిక్.. ఇలా స్థానిక ప్రజలతోపాటు, పండగకు వచ్చే వారికి పరీక్షలు పెట్టాయి. ప్రణాళికాలోపం.. పట్టణ ప్రజలకు శాపంగా మారింది. చుట్టుపక్కల జరిగే ఏ పండగలోనూ మునుపెన్నడూ ప్రజలు రోడ్డెక్కి నిరసనలు తెలియజేయడం చోటుచేసుకోలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా చివరికి సాలూరు తొలిసారిగా ఆ పేరు దక్కించుకుంది.

డమ్మీగా మారిన ఉత్సవ కమిటీ...

పండగ మొత్తం మంత్రి సంధ్యారాణి అంతా తానై నడిపించారు. ఉత్సవ కమిటీని డమ్మీ చేశారు. అధికారులతో ఒకట్రెండు సమావేశాలు నిర్వహించారు. సమన్వయ సమావేశం ఒక్కసారి కూడా నిర్వహించలేదు. సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. పండగ రోజుల్లో వేలాది మంది జనసందోహంలోనే మంత్రి నాలుగు వాహనాల కాన్వాయ్‌తో వచ్చేవారు. ఇంతమంది జనాల్లో వాహన శ్రేణిలో రావడమేమిటని భక్తులు చర్చించుకున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య కూడా ఉత్పన్నమైంది. ఎన్నడూ లేని విధంగా కొన్ని ఆచారాలకు, సంప్రదాయాలకు విరుద్ధంగా ఉత్సవాలు జరిగాయన్న విమర్శలున్నాయి. ఉత్సవ కమిటీని కీలుబొమ్మలా మార్చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా అనుభవం లేని వ్యక్తిని నియమించారన్న ఆరోపణలున్నాయి. ఏకపక్షంగానే నియామకమైన కమిటీ.. కేవలం టీడీపీ కమిటీగానే ముద్రపడింది. పెద్దలు నిర్ణయించిన ప్రకారం సిరిమానోత్సవం మంగళవారం సాయంత్రం 4.05 నిమిషాలకు ప్రారంభం కావాలి. మంత్రి సాయంత్రం 6 గంటలకు వచ్చారు. ఆమె వచ్చిన తర్వాతనే ప్రారంభమైంది. దీనివల్ల సిరిమానోత్సవం ఆలస్యమైంది. సిరిమాను పూజారి సైతం దీనిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అల్లువీధి రామమందిరం నుంచి ప్రారంభమైన కొద్దిసేపటికే అంజలి రథం చక్రం విరిగిపోవడంతో ఆగిపోయింది. మొత్తం సిరిమాను ప్రక్రియ అంతా పూర్తయ్యేసరికి బుధవారం తెల్లవారుజామున 3 గంటలైంది. ఉత్సవ కమిటీ అనుభవరాహిత్యం స్పష్టంగా కనిపించింది. చివరికి తప్పంతా మున్సిపల్ పాలకవర్గంపై నెట్టివేసే ప్రయత్నం జరుగుతోంది. పండగ విజయవంతమైతే అంతా తమ గొప్పతనంగా అధికార పార్టీ నేతలు ప్రచారం చేసుకునేవారు. ఫెయిలవ్వడంతో మున్సిపల్ పాలకవర్గంలో ఖాతాలోకి నెట్టేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కాంట్రాక్టరు నిర్వాకమేనా?

ఉత్సవం నేపథ్యంలో విద్యుత్ శాఖ తరఫున పనులు చేపట్టగా.. అవన్నీ కాంట్రాక్టరుకు అప్పగించినట్లు తెలిసింది. సదరు కాంట్రాక్టరు కాసులకు కక్కుర్తిపడి నాసిరకం పనులు చేశారన్న విమర్శలు పట్టణ ప్రజల నుంచి వినిపించాయి. ఐదు 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, మూడు 40 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, రెండు సింగిల్ ఫేజ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీనికి కారణం అధిక లోడు అని ఆ శాఖాధికారులు అంటున్నారు. విపరీతమైన ఎయిర్ కండీషనర్లు, కూలర్లు, వాటర్ మోటార్లు, మిక్సీలు, గ్రైండర్లు వాడటం వల్లే లోడు పెరిగి.. సెక్షన్ ఫ్యూజులు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని వివరణ ఇస్తున్నారు. భారీ వర్షాలు కూడా ఒక కారణంగా చెప్పుకొచ్చారు. విద్యుత్ అంతరాయంతో మోటార్లు పని చేయక తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. వాడకానికి కూడా నీరు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అటు విద్యుత్తు లేక.. ఇటు నీరు రాక.. బంధువులను పిలిచి కనీస మర్యాదలు కూడా చేయలేకపోయామని ఆవేదనతో ప్రజలు రోడ్డెక్కారు.

పండగలో విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం ఫలితంగా మూడు రోజులపాటు స్థానిక ప్రజలు, బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సహనం నశించిన పలు వీధుల్లోని ప్రజలు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులు పట్టుకుని.. సంధ్యారాణి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. పండగకు రెండు రోజులు ఉందామని దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం ఇక్కడ నీరు, కరెంటు లేక రాత్రికి రాత్రే పయనమవ్వడం కనిపించింది. మంగళవారం సిరిమానోత్సవం తర్వాత కొన్ని వీధులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినప్పటికీ.. మరికొన్ని వీధులకు బుధవారం రాత్రి వరకు ఇవ్వలేదు. దీంతో విసుగు చెందిన నాయుడు వీధి వాసులు.. ఎలక్ట్రికల్ డీఈఈ రంగారావును రామమందిరంలో నిర్బంధించి, తాళం వేశారు.

అసలే వేసవి కాలం.. ఆపై కరెంటు కష్టం

వాస్తవానికి శ్యామలాంబ ఉత్సవాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ లోడును తట్టుకునేలా ముందస్తుగా రూ.1.24 కోట్ల వ్యయంతో అయిదు 160 కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 100 కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 14, రెండు సింగిల్ ఫేజ్ 16కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఉత్సవ సమయంలో ఒక ఎస్ఈ, ఈఈ, ఏడుగురు డీఈఈలు, ఆరుగురు ఏఈలు, ఆరుగురు జూనియర్ ఇంజినీర్లు, 57 మంది ఓఎం సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ, పనిచేసినా కష్టాలు తప్పలేదు. ఉత్సవంలో భాగంగా కొన్ని వీధులకే విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి మూడు రోజులూ సరఫరా లేక ప్రజలు నరకయాతన చవిచూశారు. భోను, మజ్జిల, తోటవీధులకు గురువారం రాత్రికి కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంతో ఆందోళనకు దిగారు. మెయిన్ రోడ్డుపై టైర్లు కాల్చారు. మంత్రికి వ్యతిరేకంగా నినదించారు.



విద్యుత్ సరఫరాలో అంతరాయానికి నిరసనగా కొవ్వొత్తులు వెలిగించి ఆందోళన చేస్తున్న సాలూరు పట్టణ ప్రజలు (ఫైల్)

గృహనిర్మాణాల్లో ప్రగతి లేకుంటే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో పేదల కోసం నిర్మితమవుతున్న గృహ నిర్మాణాల్లో వచ్చేవారానికి ప్రగతి లేకుంటే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గృహనిర్మాణశాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతివారం వందల సంఖ్యలో గృహాలు పూర్తికావాల్సి ఉన్నప్పటికీ ఈ వారం 70 గృహాలు మాత్రమే పూర్తికావడంపై మండిపడ్డారు. గృహ నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, స్టీల్ అన్నీ అందుబాటులో ఉన్నప్పటికీ గృహ నిర్మాణాలు వెనుకంజలో ఉండడం సరికాదని, వచ్చే వారానికి ప్రగతి కనిపించకపోతే సంబంధిత డీఈఈలపై చర్యలు తీసుకుంటామని అన్నారు. పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేసి వచ్చే వారానికి 90 శాతం ప్రగతి కనిపించాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయని, అందుకు తగిన విధంగా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. యోగాంధ్రను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సేవలు పట్ల సంతృప్తి స్థాయి ఏ మేరకు ఉందన్న విషయమై వివిధ రకాల సర్వేలను చేపడుతుందని, అందులో జిల్లా ముందంజలో ఉండాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేసీ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో కె.హేమలత, జిల్లా ఉద్యానవన అధికారి బి.శ్యామల, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు ఎం.సుధారాణి, డాక్టర్ టి.కనకదుర్గ, డీపీఓ టి.కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు, మునిసిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సంఘాలుగా ఏర్పడితే రాయితీలు



వెలగవలసలో రైతులతో ముఖాముఖిగా మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్: ప్రభుత్వం అమలుచేస్తోన్న పథకాల రాయితీలు, రుణాలు వర్తించేలా రైతులు సంఘాలుగా ఏర్పడాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ రైతులకు పిలుపు నిచ్చారు. పార్వతీపురం మండలం వెలగవలస గ్రామంలో గురువారం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. నిమ్మగడ్డి సాగు, దిగుబడి, ఆదాయం, సాగులోని సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. నిమ్మగడ్డి సాగుకు సాగునీటి సమస్య ఉందని పలువురు రైతులు కలెక్టర్‌కు తెలిపారు. రైతులు సంఘాలుగా ఏర్పడి ఉమ్మడిగా బావులు తవ్వి సోలార్ విద్యుత్ మోటార్లు అమర్చుకోవాలని సూచించారు. దీనికోసం రాయితీలు వర్తిస్తాయన్నారు.

సూక్ష్మ నీటి సేద్యం కింద స్ప్రింక్లర్లు ఉచితంగా అందిస్తామని స్పష్టంచేశారు. నిమ్మగడ్డి సాగుకు ఉపాధి హామీ పథకం వర్తింపజేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఆయిల్ ఉత్పత్తికి అవసరమైన బ్రాయిలర్ల ఏర్పాటుకు రైతుల భాగస్వామ్యం అవసరమన్నారు. నూజివీడు సీడ్స్ సంపద రకం వరి విత్తనాలు సరఫరా చేయాలన్న రైతుల వినతిమేరకు వ్యవసాయ శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అదే రకమైన 1318 రకం విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాలమ్మ, జిల్లా ఉద్యానవన అధికారి బి.శ్యామల, ఎంపీడీఓ గోర్జి రమేష్ బాబు, మండల ఉద్యానవన అధికారి ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి వి.భార్గవ్, ఫీల్డ్ అసిస్టెంట్ పి.నూకరాజు, పంచాయతీ కార్యదర్శి వి.భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలు అధిగమించాలి

పార్వతీపురంటౌన్: జిల్లాలో కిసాన్ క్రెడిట్‌కార్డుల రుణాలపై బ్యాంకర్లు తక్షణమే స్పందించాలని, లక్ష్యాలు అధిగమించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్పష్టం చేశారు. కేసీసీలో వచ్చిన దరఖాస్తులన్నీ 15 రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులు, పలు శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన బీసీసీ, జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ 2024 సంవత్సరానికి తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లించిన రైతులకు ఈ ఏడాది రుణాలు మంజూరు చేయాలని సూచించారు. మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక ఊతం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు, ఎల్‌డీఎం ఎన్.విజయ్‌స్వరూప్, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ ఎం.వి.కరుణాకర్, డీసీసీబీ బ్యాంక్ సీఈఓ సీహెచ్ ఉమామహేశ్వరావు, జిల్లా సహకార శాఖాధికారి పి.శ్రీరామ్మూర్తి , ఏఎల్‌డీఎం కె.మౌనిక, ఇతర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ఎవరెస్టు ఎక్కినా 'ఉపాధి' కరువే..!



తోటి విద్యార్థులతో బోరు తవ్వకంలో సాగర్



పత్రికల్లో వచ్చిన కథనాలను చూపిస్తున్న సాగర్




ఉద్యోగ ఉపాధి అవకాశాలు రాక కూలీ పనులకు వెళ్తున్న గిరిజన యువత

జియ్యమ్మవలస రూరల్: రాత్రింబవళ్లు శ్రమించి.. కఠోర సాధన చేసి.. చివరకు ప్రపంచంలో ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మన్యం బిడ్డ.. ఇప్పుడు ఉపాధిలేక దిక్కులు చూస్తున్నాడు. తండ్రితో కలిసి కూలి పనులకు వెళ్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే... ప్రపంచంలో అతి ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడం అంటే ప్రాణాన్ని పణంగా పెట్టడమే. ఎన్నో ఆశలు ఆశయాలు ఆలోచనల నడుమ ఎవరెస్టు శిఖరాన్ని జియ్యమ్మవలస మండలం పరజపాడు పంచాయతీ గదబవలస గ్రామానికి చెందిన బొడ్ల చిన్న నారాయణరావు తవిటమ్మల కుమారుడు బొడ్ల సాగర్ అధిరోహించాడు. యువకుడి సాహసాన్ని మే 7వ తేదీ 2017 సంవత్సరంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని పత్రికలు ప్రచురించి ప్రశంసలతో ముంచెత్తాయి. అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు జిల్లా అధికారులు సైతం సాగర్ సాహసంపై ప్రశంసలు కురిపించారు. సన్మానాలు చేశారు. విద్యార్హతను బట్టి ఉద్యోగం ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అంతే.. ఆ తరువాత 8 సంవత్సరాలు గడిచిపోయినా.. ఈ ఎవరెస్టు వీరుడు ఎక్కడున్నాడో.. ఏం చేస్తున్నాడో తెలియని పరిస్థితి. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు భద్రగిరి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యాభ్యాసం చేస్తూ సుమారు 6 నెలల పాటు కఠోరమైన శిక్షణ పొంది 120 మందిలో కేవలం ఆరుగురు మాత్రమే ఎవరెస్టు శిఖరం ఎక్కగలిగారు. వారిలో సాగర్ ఒకడు. ఆ ప్రయాణంలో తన కుడిచేతి రెండు వేళ్లను పోగొట్టుకున్నాడు. ఆ తరువాత ఏళ్లు గడిచినా సాగర్‌కు ఎలాంటి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ప్రస్తుతం తన తండ్రితో కూలి పనులకు, బోర్లు వేసేందుకు వెళ్తున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబాన్ని కూలి డబ్బులతో నెట్టుకొస్తున్నాడు. సాగర్‌ను ఉద్యోగిగా ఉన్నత స్థాయిలో చూడాలన్న కన్నవారి కలలు కళ్లగానే మిగిలిపోయాయి. పర్వతారోహణకు ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి రూ.25లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ఖర్చు చేసినా.. విజయాన్ని, పేరు ప్రఖ్యాతలను తెచ్చిపెట్టిన ఆ యువతను ఆదుకోవడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, జిల్లా అధికారులు స్పందించి సాగర్‌కు ఉద్యోగ అవకాశాన్ని కల్పించి ఆదుకోవాలని తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

కిలో బెండకాయలు రూ.2

- 15 కిలోల బరువున్న క్రేట్ బెండకాయల ధర గరిష్టంగా రూ.30
- నష్టాల్లో బెండ రైతులు
- కోత ఖర్చులు సైతం దక్కని దైన్యం



సాగులో ఉన్న బెండ పంట



రామభద్రపురం అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న బెండ రైతులు

రామభద్రపురం: బెండ రైతుకు క(న)ష్టకాలం వచ్చింది. రామభద్రపురం అంతర్ రాష్ట్ర మార్కెట్‌లో కిలో బెండకాయల ధర రూ.2 పలుకుతోంది. 15 కిలోల బరువున్న క్రేట్ బెండకాయలను గరిష్టంగా రూ.30కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ధరలు లేక కోత, రవాణా ఖర్చులకు తిరిగి అప్పుచేయాల్సి వస్తోందంటూ రైతులు గగ్గోలుపెడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు సాగుచేసిన రైతుకు కష్టాలే ఎదురవుతున్నాయని, పది నెలలుగా పంటను కొనుగోలుచేసేవారి కోసం ఎదురు చూడాల్సిన గడ్డు పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి పైసా పెట్టుబడి సాయం అందక, పంటకు గిట్టుబాటు ధరలేక అప్పుల్లో కూరుకుపోతున్నామంటూ ఆవేదన చెందుతున్నారు. ధాన్యం నుంచి కూరగాయల వరకు ఏ పంటకూ మార్కెట్‌లో మద్దతు ధర లేదని చెబుతున్నారు. రైతులంటే కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, సమస్యలను పట్టించుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. ఓటు వేసి అధికారం కట్టబెట్టిన రైతన్నకే వెన్నుపోటు పొడవడం, నష్టాల్లో ముంచడంపై గగ్గోలు పెడుతున్నారు.

ధరల కల్పనకు చర్యలు తీసుకుంటాం

రైతులతో మాట్లాడి కూరగాయలకు గిట్టుబాటు ధరల కల్పనకు చర్యలు తీసుకుంటాం. రైతులతో మాట్లాడి ఉద్యానశాఖాధికారులతో అనుసంధానం చేసుకుని రైతు బజారులో గిట్టుబాటు ధరకు విక్రయించేకునేలా సౌకర్యాలు కల్పిస్తాం.

– కిరణ్‌కుమార్, మార్కెటింగ్‌శాఖ ఎ.డి., బొబ్బిలి

కష్టానికి ఫలితం దక్కడం లేదు..



బెండకాయలకు కనీస ధర లేదు. చీడపీడల నివారణ, పంట కోత, రవాణా ఖర్చులు కూడా రావడంలేదు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి చూడలేదు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కె సత్యం, బెండ రైతు, చింతలవలస

కోత ఖర్చులకు అప్పుచేయాల్సిందే..



నేను 20 సెంట్ల విస్తీర్ణంలో బెండ పంట సాగుచేశాను. కాపుకొచ్చిన పంటను చూసి ఆనందించాలో, గిట్టుబాటు ధర లేక బాధపడాలో తెలియడం లేదు. పంటను మార్కెట్‌కు తెస్తే కోత, రవాణా ఖర్చులు రావడం లేదు. 10 క్రేట్లను ఆటోపై రామభద్రపురం అంతర రాష్ట్ర మార్కెట్‌కు తెస్తే రూ.300కు వచ్చాయి. అందులో ఆశీలు రూ.100, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు రూ.100 పోగా రూ.100లు మిగిలింది. కూలీలకు, పురుగు మందులు, ఎరువులకు అప్పు చేయాల్సి వస్తోంది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– కటికి గంగమ్మ, బెండ రైతు, రామభద్రపురం

ప్రభుత్వ ఉద్యోగుల్లో బదిలీల చర్చ

- ఐదేళ్లు దాటిన వారికి తప్పనిసరి
- ప్రాధాన్యం ఉన్న పోస్టులపై పలువురి దృష్టి
- సిఫార్సు లేఖలకు ప్రదక్షిణలు

విజయనగరం అర్బన్: బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. జూన్ రెండో తేదీకల్లా ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. దీంతో ఇప్పుడు ఉద్యోగుల్లో ఎక్కడ చూసినా బదిలీలపై చర్చే నడుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చాక గతేడాది సెప్టెంబర్‌లో బదిలీలు చేసింది. పిల్లల చదువులు, వ్యక్తిగత ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కీలకమైన 15 శాఖల్లోనే అప్పట్లో సాధారణ బదిలీల ప్రక్రియ చేపట్టింది. తాజాగా అన్ని ప్రభుత్వ శాఖల్లో అనుమతివ్వడంతో ఈ సారి భారీ సంఖ్యలోనే ఉద్యోగులకు స్థానచలనం కలగనుంది.

సిఫార్సు లేఖలకు ప్రదక్షిణలు

కొన్నేళ్లుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని 34 శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో గుబులు ప్రారంభమయింది. ఒకే ప్రాంతంలో ఐదేళ్లకు పైబడి పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి కావడంతో ప్రాధాన్య పోస్టింగ్‌లకు అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సుల కోసం కొందరు పైరవీలు చేస్తున్నట్టు సమాచారం.

క్లుప్తంగా

శ్యామలాంబ హుండీ ఆదాయం రూ.8.19 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సాలూరు: సాలూరు శ్యామలాంబ అమ్మవారి హుండీ ఆదాయం 8,19,900 రుపాయిలు వచ్చినట్లు ఎండోమెంట్ అధికారి రమేష్ గురువారం తెలిపారు. శ్యామలాంబ పండగ నేపథ్యంలో అమ్మవారి గుడికి భక్తులు పోటెత్తారు. హుండీ ఆదాయాన్ని ఆలయంలోనే లెక్కింపు చేపట్టారు.

ప్రీ ఎక్లాంప్సియాపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురం టౌన్: గర్భిణుల్లో ప్రీ ఎక్లాంప్సియా ఒక ప్రమాదకర సూచికని, సకాలంలో లక్షణాలు గుర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. ప్రపంచ ప్రీ ఎక్లాంప్సియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు హైరిస్క్ సమస్యలు ముందస్తుగా గుర్తించాలన్నారు. బీపీ అధికంగా ఉండడం, తీవ్రమైన తలనొప్పి, దృష్టి సమస్య, ముఖం,చేతులు, కాళ్లు ఉబ్బడం, మూత్ర విసర్జన తగ్గడం తదితర లక్షణాల ద్వారా దీన్ని గుర్తించాలన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, పీఎల్ రఘుకుమార్, డీపీహెచ్ఎన్‌వో ఉషారాణి, డీపీవో లీలారాణి, కార్యాలయ సూపరింటెండెంట్ కామేశ్వరరావు, డీసీఎం విజయలత, సీసీ శ్రీనివాసరావు, వైద్య మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి హుండీల్లో చోరీ

సాలూరు: పట్టణంలోని పలు ఆలయాల్లో హుండీల్లో చోరీలు జరిగాయి. పట్టణంలోని నూకాలమ్మ తల్లి, సత్తమ్మ తల్లి, దేశమ్మ తల్లి ఆలయాల్లో హుండీలను దుండగలు పగులగొట్టి నగదు, కానుకలను ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

ఉపాధ్యాయ బదిలీల వెబ్‌సైట్ వేగాన్ని పెంచాలి

- ఏపీ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో మొట్టమొదటిసారి బదిలీల చట్టాన్ని అనుసరించి జరుగుతున్న బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేయడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడారు. బదిలీలకు దరఖాస్తు చేయడంలో సర్వరు యొక్క వేగాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఏఏ పాఠశాలల్లో ఏఏ పోస్టులు అదనంగా ఉన్నాయో ఈ జాబితాల ద్వారా తెలుస్తుందని తద్వారా సంబంధిత ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుందని పేర్కొన్నారు. కావున ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి ఉపాధ్యాయుల రీఅపోర్షన్‌మెంట్ వివరాలు వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నామన్నారు. న్యాయ స్థానాల ఉత్తర్వులను అనుసరించి బెంచి మార్క్ వ్యాధులు గల ఉపాధ్యాయులకు ఈ బదిలీ నియమాలు వర్తించవనీ, అయితే సంబంధిత వ్యక్తులు వారికి అంగీకారం అయితే బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

జాడ లేని సంక్షేమం..!

- అర్థాకలితో నిర్మాణ రంగ కార్మికులు
- ఉమ్మడి జిల్లాలో నిలిచిపోయిన 1590 క్లెయిమ్స్
- కార్మికుల సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం
- ఎన్నికల నాటి హామీలు ఏమయ్యాయి?



పనిలో నిమగ్నమైన భవన నిర్మాణ కార్మికులు

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికుల పొట్టకొట్టింది. కార్మికుల సంక్షేమ బోర్డులోని నిధులను దారి మళ్లించారు. కనీసం మరణ క్లెయిమ్స్, ప్రసూతి క్లెయిమ్స్, స్కాలర్‌షిప్ క్లెయిమ్స్, అనారోగ్య క్లెయిమ్స్ కూడా అందకుండా చేశారు. ఫలితంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సుమారు 1590 క్లెయిమ్స్ ఇప్పుడు వరకు అపరిష్కృతంగానే ఉన్నాయి. భవన నిర్మాణ, ఇతర అసంఘటిత రంగ కార్మికులు, కూలీల జీవితాలు కొద్ది నెలలుగా దుర్భరంగా మారాయి. అరకొర పనులు, అప్పుల బాధలు, కష్టాల సుడిగుండాల్లో చిక్కుకుని కొట్టుమిట్టాడుతున్నారు. పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, ఇతర ఖర్చులకు సైతం డబ్బు పుట్టక బతుకు భారంగా ఈడుస్తున్నారు. సూపర్ సిక్స్, సెవెన్ అంటూ అలవిగాని హామీల వర్షం కురిపించి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది.

కొత్త పథకాలు అమలు చేయకపోగా, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలైన పథకాలకు సైతం గండి కొట్టింది. కార్మిక శాఖ లెక్కల ప్రకారం ఉమ్మడి విజయనగరం జిల్లాలో దాదాపు 2లక్షల పైగా మంది అసంఘటిత రంగ భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. లెక్కల్లోకి రాని వారు మరికొన్ని వేలల్లో ఉంటారు. ఇప్పుడు వరకు నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులు 91,528 మంది. వీరిలో ఎక్కువ మంది నిర్మాణ రంగంపై ఆధారపడిన తాపీ మేస్త్రీలు, కూలీలు, రాడ్ బెండర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, వడ్రంగులు, పెయింటర్లు ఉన్నారు. గతేడాది సార్వత్రిక ఎన్నికలప్పుడు భవన నిర్మాణ బోర్డును పునరుద్ధరిస్తామని టీడీపీ మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చారు. సాధికార సంస్థ ఏర్పాటు చేస్తామని, అన్ని వర్గాల కార్మికులకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని, కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నేటి వరకు ఆ ఊసే ఎత్తలేదు.

పేరు మార్పు తప్ప సాయం లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా పేరు మార్చారు. అంతకు మించి పథకం అమలుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ ఉత్తివిగానే మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమా పథకం కింద విజయనగరం జిల్లాలో దాదాపు 11వేల కుటుంబాలకు రూ.118 కోట్ల మేర సాయం అందింది. ఈ ప్రభుత్వంలో అది పూర్తిగా నిలిచిపోయింది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సాయం ఇలా..

వైఎస్సార్ కల్యాణమస్తు కింద భవన, ఇతర నిర్మాణ కార్మికులకు రూ.20వేలు చొప్పున అందించారు. వైఎస్సార్ బీమా పథకం కింద ప్రమాద మరణాల్లో బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు, సహజ మరణాలకు రూ.లక్ష, వైకల్యం సంభవిస్తే రూ.5 లక్షల చొప్పున ఇచ్చి ఆదుకున్నారు. రిజిస్టర్ కాని కార్మికులు ప్రమాదాల్లో మరణిస్తే రూ.5 లక్షలు, వైకల్యం సంభవిస్తే రూ.2.5 లక్షలు ఇచ్చారు. అసంఘటిత రంగ కార్మిక కుటుంబాల్లోని వ్యక్తులు అనారోగ్యం బారిన పడిన సందర్భాల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు వైద్య సేవలను పూర్తి ఉచితంగా అందించారు.

కార్మికుల పొట్ట కొట్టారు..



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్న పైసా కూడా ఇవ్వలేదు. కార్మికులకు తీరని అన్యాయం చేసింది. విజయనగరం జిల్లా పరిధిలో చాలా మంది కార్మికులకు గుర్తింపు ఇవ్వలేదు. ఈ ఏడాదిలో ఒక్క క్లెయిమ్ చెల్లించలేదు. ప్రభుత్వం ఏమాత్రం సాయం చేయడం లేదు. భవన నిర్మాణ రంగాన్ని నిర్లక్ష్యం చేసింది.

–బి.రమణ
జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి

ఆదుకునే పథకాలేవీ?

రోజూ ఉదయాన్నే విజయనగరం గణేష్ గుడి మీదకు పని కోసం వస్తాను. వారంలో మూడు రోజులు పని దొరకడం చాలా కష్టంగా ఉంటోంది. గతంలో ఈ పరిస్థితులు లేవు. పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో జీవనం సాగిస్తున్నాం. ముఖ్యంగా పిల్లల చదువులు భారంగా మారాయి. గతంలో అమ్మ ఒడి, వసతి దీవెన కింద సాయం అందేది. ఇప్పుడు ఆదుకునే ఆ పథకాలు కూడా లేకుండా పోయాయి.

– సత్యం, తాపీ మేస్త్రీ, విజయనగరం

కార్మిక బోర్డును తక్షణమే పునరుద్ధరించాలి



ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన భవన నిర్మాణ కార్మికులకు ప్రయోజనం లేకుండా పోయింది. ఇసుక కొరత లేకపోయినా పనుల్లేకుండా పోయాయి. భవన కార్మికుల సంక్షేమ బోర్డును రద్దును పునరుద్ధరిస్తానన్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే లేదు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి.

–మజ్జి ఆదినారాయణ,
భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆగిన ఇళ్ల నిర్మాణం

గత ప్రభుత్వం మా ఊర్లో పేదల ఇళ్ల నిర్మాణం కోసం పెద్ద ఎత్తున లేఅవుట్లు ఏర్పాటు చేసింది. వాటిలో వేలల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీంతో బయటకు ఎక్కడికి వెళ్లే పని లేకుండా ఊర్లోనే పనులు ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. పెయింటింగ్, ఉడ్‌వర్క్స్, ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులపై ఈ ప్రభావం పడుతోంది. వారాలు, నెలల తరబడి ఇంటి పట్టునే ఉంటే మా కుటుంబాలు ఎలా గడుస్తాయి?

–కృష్ణ అప్పారావు,
పెయింటర్, విజయనగరం

నిర్మాణాలు వేగవంతం చేయాలి : కలెక్టర్



చప్పవానివలసలో గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: మన్యం జిల్లాలో వివిధ దశల్లో ఉన్న పీఎం జన్ మన్ గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం పార్వతీపురం మండలంలోని చప్పవానివలస గ్రామంలో కలెక్టర్ పర్యటించి వివిధ దశల్లో ఉన్న పీఎం జన్ మన్ గృహ నిర్మాణాలను ఆయన నేరుగా స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. గృహ నిర్మాణాలు జాప్యానికి గల కారణాలను అధికారులను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించిన రెండవ విడత బిల్లులు మరి కొద్ది రోజుల్లో మంజూరు కానున్నాయని, తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన మెటీరియల్ ఎంతమేరకు అందుబాటులో ఉందో అధికారులను ఆరా తీశారు. గృహ నిర్మాణ పనులకు ఆటంకం లేకుండా అవసరమైన మెటీరియల్‌ను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు. కలెక్టర్ పరిశీలన కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అధికారి జి.సోమేశ్వరరావు, చిరంజీవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు వచ్చి.. మృత్యు ఒడిలోకి...



ప్రమాదంలో మృతి చెందిన గెడ్డ రామకృష్ణ

తెర్లాం: వివాహ వేడుకలకు వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తెలుసుకున్న తల్లి, తమ్ముడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నాలుగు రోజుల కిందట తెర్లాం మండలంలోని రాజయ్యపేట గ్రామానికి వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఓ యువకుడు బుధవారం రాత్రి జరిగిన ఆటో బోల్తా పడిన ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. దీనికి సంబంధించి తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు, కుటుంబ సభ్యులు గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరివిడి మండలం కోడూరు గ్రామానికి చెందిన గెడ్డ రామకృష్ణ(24) తెర్లాంలోని శ్రీ వేంకటేశ్వర కళాశాల వద్ద బుధవారం రాత్రి ఆటో బోల్తా పడిన ప్రమాదంలో మరణించాడు. తెర్లాం మండలం రాజయ్యపేట గ్రామంలో జరగనున్న వివాహ వేడుకలో పాల్గొనేందుకు తన మేనమామ ఇంటికి నాలుగు రోజుల క్రితం రామకృష్ణ వచ్చాడు. అక్కడ జరిగిన వివాహ వేడుకలో పాల్గొని అందరితో సరదాగా గడిపాడు. బుధవారం రాత్రి తెర్లాం మండలం ఎం.ఆర్ అగ్రహారంలో జరుగుతున్న స్నేహితుని వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు రామకృష్ణ తన చినమేనమామతో కలిసి ఆటోలో వెళ్లాడు. వివాహ వేడుకలో పాల్గొని అక్కడ భోజనం చేసి తిరిగి రాజయ్యపేట గ్రామానికి ఆటోలో వెళ్తున్నాడు. ఆటోను తన చినమేనమామ నడుపుతుండగా అతని పక్కన రామకృష్ణ కూర్చొన్నాడు. తెర్లాం వెంకటేశ్వర కళాశాల వద్దకు వచ్చే సరికి ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి బోల్తా పడింది. దీంతో రామకృష్ణ కింద పడిపోగా, ఆటో అతనిపై పడిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న కొందరు రామకృష్ణను బయటకు తీశారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స చేసేటప్పటికే రామకృష్ణ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారని ఎస్ఐ చెప్పారు. మృతుని సోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించినట్టు ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు.

బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ..

రామకృష్ణ బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రామకృష్ణ తండ్రి వెంకటరమణ ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి రామకృష్ణ బైక్ మెకానిక్‌గా పని చేస్తూ తనకు వచ్చే కొద్దిపాటి ఆదాయంతో తల్లి, తమ్ముడిని పోషిస్తున్నాడు. వివాహ వేడుకకు మేనమామ ఊరు వెళ్లి వస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తెలుసుకున్న రామకృష్ణ తల్లి, తమ్ముడు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య



సువ్వాడ గాంధీ(ఫైల్)

గుర్ల: మండలంలోని కెల్లకు చెందిన సువ్వాడ గాంధీ (32) అప్పులు బాధ భరించలేక పురుగులు మందు తాగి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. కెల్లకు చెందిన సువ్వాడ గాంధీ తన అవసరాల నిమిత్తం అప్పులు ఎక్కువగా తీసుకున్నాడు. అప్పులు తిరిగి చెల్లించాలని ఒత్తిడి రావడంతో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఇది గమనించి కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స అందుతుండగా గురువారం ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతునికి భార్య మంగ, కుమారుడు రుషివర్ధన్, కుమార్తె లహరి ఉన్నారు. గుర్ల ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి వేతనదారు మృతి



తవుడమ్మ (ఫైల్)

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారు చెలపురెడ్డి తవుడమ్మ(68) పని చేస్తున్న ప్రదేశంలో గురువారం మృతి చెందినట్టు ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు మరియదాస్ తెలిపారు. గ్రామంలో జగ్గన్న చెరువు పూడిక పనులు చేస్తుండగా చద్దన్నం తిని చేతులు కడుగుతుండగా తీవ్ర అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న ఏపీవో సాయిరాం, టీఏ శ్రీనివాసరావు ఎంపీడీవో ఆదేశాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎంపీడీవో వేతనదారు మృతి పట్ల సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నడిపేన పురుషోత్తం(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన యువకుడు నడిపేన పురుషోత్తం(27) గురువారం మృతి చెందాడు. యువకుడి మృతిపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బద్రీనాథ్ యాత్ర నిమిత్తం యాత్రికులను తీసుకువెళ్లేందుకు బస్సు డ్రైవర్లుగా సారిపల్లికి చెందిన పురుషోత్తం, శ్రీనివాసరావు ఈ నెల 15న వెళ్లారు. 17వ తేదీ అర్ధరాత్రి జార్ఖండ్ రాష్ట్రంలోని రామ్‌గడ ప్రాంతంలో బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొట్టడంతో క్యాబిన్‌లో కూర్చున్న పురుషోత్తంకు తీవ్ర గాయాలయ్యాయి. మరుసటి రోజు చికిత్స నిమిత్తం ప్రైవేటు అంబులెన్సులో విశాఖలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు వైద్యులు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ పురుషోత్తం ప్రాణాలు విడిచాడు. మృతుడికి తల్లిదండ్రులు, అన్నయ్య ఉన్నారు. పురుషోత్తం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

భూ సమస్యలు తలెత్తకూడదు..: జేసీ



సమావేశంలో పాల్గొన్న ఐదు మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది

గజపతినగరం: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతన్నలకు భూ సమస్యలు వస్తే తక్షణమే ఆయా గ్రామాలకు వెళ్లి సమస్యలను పరిష్కారం చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. గజపతినగరం మండల కేంద్రం పురిటిపెంట పాత్రేరు వారి కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన ఐదు మండలాల రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రైతులు సమస్యలతో కార్యాలయాలకు వచ్చినప్పుడు వారిని ఆహ్వానించి వారి సమస్యలను సంపూర్ణంగా అడిగి తెలుసుకొని పరిష్కరించేలా ఉండాలని సిబ్బందికి సూచించారు. భూ సమస్యల పరిష్కారం విషయంలో రీసర్వే అయిన తరువాత వచ్చిన ఎల్‌పీఎం నంబర్లు, సర్వే నంబర్లు టాలీ చేసుకొని తప్పులు దొర్లకుండా క్షేత్ర స్థాయికి వెళ్లి వాస్తవాలను తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. బొబ్బిలి ఆర్‌డీవో జెవిఎస్ఎస్.రామ్మోహన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీ, ఈడీ ఎస్సీ సొసైటి ఇంచార్జ్ ఆర్‌డీవో వెంకటేశ్వరరావు, స్థానిక తహసీల్దార్ బి.రత్నకుమార్‌తో పాటు ఐదు మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని సాలూరు వెళ్లే బైపాస్ రోడ్డులో కొండకెంగువ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టి వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మిర్తివలస గ్రామానికి చెందిన చింతాడ రవి కుమార్ సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై రామభద్రపురం మండల కేంద్రానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా బైపాస్ రోడ్డులోని కొండకెంగువ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదే సమయంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం స్థానికులు పక్కనే ఉన్న స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి సింహాచలం ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

భోగాపురం: మండలంలోని మహారాజుపేట జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య, భర్తలకు గాయాలయ్యాయి. భోగాపురం గ్రామానికి చెందిన అచ్యుతరావు, లక్ష్మి దంపతులు సొంత పనుల నిమిత్తం స్కూటీపై తగరపువలస వెళ్తుండగా.. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. స్థానికులు, కుటుంబ సభ్యులు దంపతులిద్దరినీ తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లపై.. టీడీపీ వర్గీయుల దాడి



రజకుల ఇళ్లపై దాడి చేస్తున్న టీడీపీ వర్గీయులు





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామంలో అమ్మవారి పండగ ముగింపు రోజు బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రజకుల ఇళ్లపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులైన బెవర కులస్తులు దాడికి తెగబడ్డారు. పిడిగుద్దులతో పాటు కర్రలతో దాడి చేసినట్టు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది. ఈ దాడిలో గాయపడిన వాడాడ పోలమ్మ, వెంపడాపు రమేష్, నందిగాం సీత, చోడవరపు అరుణలను గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుప్ప సింహాచలం స్థానిక సీహెచ్‌సీకి ఆటోపై తరలించారు. వీరిలో పోలమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీరిలో అరుణ బాలింత కావడంతో ప్రథమ చికిత్స చేసి ఇంటికి పంపినట్టు వైద్యులు తెలిపారు. ఇదే విషయమై రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఇరు వర్గాలకు చెందిన యువకుల మధ్య మంగళవారం నాడే తగాదా జరిగింది. టీడీపీ వర్గీయులు ఎప్పుడు ఎలాంటి దాడులకు పాల్పడతారోనని రజకులు ఆందోళన చెందుతున్నారు. తమకు భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందినా కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నట్టు సింహాచలం ఆరోపించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

ఎండీయూ ఆపరేటర్ల ఆందోళన



ధర్నా చేస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్లు

విజయనగరం ఫోర్ట్: ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర సమైక్య ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఎండీయూ వాహనాలతో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో 27 వేల మంది కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. రేషన్‌కు బదులు నగదు బదిలీ అమలు కోసం కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థపై దాడి చేస్తుందన్నారు. అతి తక్కువ ఖర్చు వేతనాలతో వాహన సర్వీసు, పెట్రోల్, రేషన్ తరలింపు ఖర్చు భరించి ప్రజలకు ఇంటింటికి సకాలంలో పంపిణీ చేస్తున్న వ్యవస్థను రద్దు చేయటం ప్రజల్ని మరింత ఇబ్బందులకు గురిచేయడమే అన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు సిహెచ్.వెంకటరావు, పవన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.